


TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :78 గురువారం 18 జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad





## ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో

# తెలంగాణ పబ్లిక్ స్కూల్

## ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు





- ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది
- ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు
- అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం
- స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డి,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు.

2




## హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

- భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం
- హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం
- ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ
- మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య

ప్యారిస్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

2



## సన్నరకాలను పండించేలా రైతు కమిషన్

# సిఫారసు

- -రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- వారు ఆర్థికంగా
- - ఎదగాలన్న దిశగా కృషి
- - పేదలు సన్నబియ్యం తినాలి.
- - రైతులు ఆర్థికంగా ఎదగాలి
- - కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు
- భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.




## దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని

# దోచుకుంటోంది

- రాష్ట్రంలో సంక్షేమం లేదు. అంతా సంక్షోభమే
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా
- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కెసిఆర్ మళ్లీ సిఎం
- సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- పాలేరు నియోజకవరగ్గ బూత్ కార్యకర్తల భేటీలో కెటిఆర్

02

ఖమ్మం,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

- అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ
- వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం
- భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

వరంగల్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా



ఇచ్చారు.నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు.

2



## నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

- రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం
- రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

2

కరీంనగర్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు.

## రెండోవిడతలో గుడిసువాసులకు

# ప్రాధాన్యం

- 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన
- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

2

మొదటిపేజీ తరువాయి

# సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు

**రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి**

**పేదలు సన్నబియ్యం తినాలి..రైతులు ఆర్థికంగా ఎదగాలి**

**కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి విక్రమార్క వెల్లడి**

హైదరాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు.ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ పబ్లిక్ స్కూల్

ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు.రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# హర్మ్యూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మ్యూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోదీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హోర్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా–భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

మొదటిపేజీ తరువాయి

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఏ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు

మొదటిపేజీ తరువాయి

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు.నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# భుదేరా సెలెస్టికా స్కూల్ పై విచారణ జరపాలి: రవి నాయక్

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 17:**

మునిపల్లి మండలం భుదేరా గ్రామంలోని సెలెస్టికా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తీవ్ర నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, పాఠశాలపై సమగ్ర విచారణ నిర్వహించి అవసరమైతే గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందజేసిన ఆయన, పాఠశాలలో సుమారు 281 మంది విద్యార్థులు చదువుతుండగా కేవలం మూడు టాయిలెట్లు, మూడు యూరినల్స్ మాత్రమే ఉండటం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను పాఠశాల యాజమాన్యమే బలవంతంగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అదేవిధంగా అర్హతలు లేని వ్యక్తులతో బోధన చేయిస్తున్నారని, పాఠశాల భవనం కింది అంతస్తులో వెల్డింగ్ షాపు, హోటల్ నిర్వహించడం వల్ల అగ్నిప్రమాదాల ముప్పు ఉందని ఆరోపించారు. పాఠశాలలో సరైన ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు కూడా లేవని పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధం లేని బస్సులను పాఠశాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని, అడ్మిషన్ ఫీజుల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేసి పేద, మధ్యతరగతి తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కావున ఈ అంశాలపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లయితే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అవసరమైతే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని రవి నాయక్ డీఈఓను కోరారు.



# బిస్లరీ యాజమాన్యం కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తోంది: కె. రాజయ్య

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 17:**

ఐడీఏ పాశమైలారంలోని బిస్లరీ కార్మికులు గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కె. రాజయ్య బుధవారం మాట్లాడారు. బిస్లరీ యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆయన ఆరోపించారు. కార్మికులు చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసుకోవడం తప్పు కాదని, అయితే యూనియన్ ఏర్పాటు చేసినందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ట్రాన్స్‌ఫర్లు, మెమోలు, వేధింపులతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.యాజమాన్యం తన మొండి వైఖరిని వీడకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘటిత పోరాటంతోనే విజయం సాధ్యమవుతుందని, చివరకు కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిర్బీ యూనియన్ నాయకులు శ్రీనివాస్, జైపాల్, మహేశ్వర్ రెడ్డి, పార్లే యూనియన్ నాయకులు సంతోష్, సుధాకర్, శ్రీకాంత్, సెవెన్ యూనియన్ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశ్రీశ్రీ దుర్గాభవాని సమేత శ్రీ పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవాలయ సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్ మిర్రర్: బాలాపూర్ ప్రతినిధి జూన్ 17 :-**

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్, ప్రశాంతి హిల్స్ 58వ డివిజన్, రోడ్ నెం.2, మీర్‌పేట్ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ దుర్గాభవాని సమేత శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవతామూర్తుల దివ్య కటాక్షం, ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్ రెడ్డి, అనిల్ యాదవ్, సిద్దాల చిన్న బీరప్ప, మాజీ అధ్యక్షులు కామేష్ రెడ్డి, మదారి రమేష్, విజయ్, శీను నాయక్, గోపి యాదవ్, ప్రవీణ్ రెడ్డి, నర్సిరెడ్డి, మాజీ మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కృపేష్, నిర్మలారెడ్డి, బిందు తదితరులు పాల్గొన్నారు.



# గడ్డ పోతారం మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోందా..?

- మాదారంలో అక్రమ వాణిజ్య నిర్మాణాలు..చోద్యం చూస్తున్న అధికారులు
- అనుమతులు గ్రామ పంచాయతీవి.. నిర్మాణాలు మున్సిపాలిటీ లో..
- పర్మిషన్ లేకుండానే షట్టర్ల ఏర్పాటు..? షట్టర్లకు అనుమతులు లేవన్న అధికారులు
- మున్సిపల్ నిబంధనలకు తూట్లు, నిద్రావస్థలో మున్సిపల్ అధికారులు
- వ్యాపార సముదాయాలపై పెరుగుతున్న అనుమానాలు
- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..? బిల్డింగ్ పర్మిషన్లు తీసుకున్నారా..?
- పార్కింగ్, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా..?
- పాత గ్రామ పంచాయతీ అనుమతులపై ప్రజల్లో సందేహాలు
- అక్రమ నిర్మాణాలకు ఎవరి అండ..? తనిఖీలు చేపట్టాలని స్థానికుల డిమాండ్
- అధికారులు నిర్మాణాలపై పూర్తి వివరాలు వెల్లడి చేయాలని స్థానికుల డిమాండ్
- మున్సిపాలిటీ పరిధిలో అక్రమ వ్యాపార సముదాయాల నిర్మాణాలు?
- పర్మిషన్ లేకుండానే కమెర్షియల్ భవనాల నిర్మాణమా?

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 17:**

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం గ్రామంలో వ్యాపార సముదాయాల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండానే షాపింగ్ కాంప్లెక్స్‌లు, షట్టర్లతో కూడిన వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణాలకు అనుమతులు పొంది, మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాలు చేయడం వల్ల కాలం చెల్లిన అనుమతుల వల్ల మున్సిపల్ ఆదాయానికి పెద్ద గండి పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ కి ఒక విధమైన నిబంధనలు ఉండగా, మున్సిపాలిటీ పరిధిలో మాత్రం వాణిజ్య భవనాలకు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతి అవసరం. భవనం స్వభావం, స్థల విస్తీర్ణం, పార్కింగ్ సౌకర్యం, రోడ్డు వెడల్పు, అగ్నిమాపక భద్రత తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది.అయితే మాదారం గ్రామంలో కొందరు నిర్మాణదారులు ఎలాంటి అనుమతులు లేకుండానే షట్టర్లు ఏర్పాటు చేసి వ్యాపార సముదాయాల నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

**మున్సిపాలిటీ లొ నిర్మాణాలు చేపడితే తీసుకోవాల్సిన అనుమతులు ఏమిటి..?:**

**మున్సిపాలిటీ పరిధిలో కమెర్షియల్ భవనాలు నిర్మించాలంటే సాధారణంగా:**

మున్సిపల్ నుండి బిల్డింగ్ పర్మిషన్
ఆమోదిత లేఅవుట్ ధృవీకరణ
భవన నమూనా (బిల్డింగ్ ప్లాన్) ఆమోదం
పార్కింగ్ నిబంధనల అమలు
అవసరమైతే అగ్నిమాపక శాఖ అనుమతి
సంబంధిత ఫీజుల చెల్లింపు
తప్పనిసరిగా ఉండాలి.

**ప్రజల్లో సందేహాలు:**

మాదారం గ్రామంలో ప్రస్తుతం కొనసాగుతున్న వ్యాపార సముదాయాల నిర్మాణాలకు సంబంధించి:

మున్సిపల్ అనుమతులు తీసుకున్నారా.?

ఆమోదిత ప్లాన్ల ప్రకారమే నిర్మాణాలు జరుగుతున్నాయా.?

పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారా.?



అధికారులు తనిఖీలు నిర్వహించారా.?

అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యమా..?:**

మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే వాటిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని స్థానికులు పేర్కొంటున్నారు.

# మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా ఎమ్మెల్యే మర్రి జన్మదిన వేడుకలు

**మల్కాజిగిరి, జూన్ 17(హైదరాబాద్ మిర్రర్ ):**

మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు జేఏసీ వెంకన్న ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనహృదయనేత, మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత నిరంతర శ్రామికుడు, పరిపాలన సమర్థుడు ఆధునికతకు పట్టంకట్టే నాయకుడు తన విలువలు విజయంతో ప్రజా సమస్యల పరిష్కారం తో పాటు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని మల్కాజిగిరి నియోజకవర్గం సమగ్రాభి వృద్దే లక్ష్యంగా పనిచేస్తు ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండే నాయకుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి , మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సునీత రాము యాదవ్, మురుగేష్,చిన్న యాదవ్, నర్సింగ్, ఉపేందర్, నీలం సతీష్, , కాటంరాజు, బాబు పటేల్, సిద్ది రాములు, రాము యాదవ్,గంగాధర్ కృష్ణ, సైదులు, గణేష్, నరహరి, కరీం,రమేష్, భాగ్యనంద్, బిక్షపతి,, సతీష్, సిక్క ప్రభాకర్,శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, రాములు, రామకృష్ణ, ,నవీన్, కుమార్, కిరణ్, కొటేష్, అనిల్, వెంకటేష్, శ్రీకాంత్, చంద్రమౌళి, ఫరీద్, నర్సింగ్ రావు,లక్ష్మణ్, శ్రీధర్, శారద, అనిల్, సంతోష్ గుప్తా, తులసి సురేష్, మల్లేష్ యాదవ్, కిట్టు, రామచందర్, పిఎస్ శ్రీనివాస్, నర్సింగ్ రావు,శ్రీనివాస్,శ్రీకాంత్ యాదవ్, జంగా రాజు, బాబన్న, వెంకటేష్, వేణు యాదవ్, సురేష్,నరేష్, బాలకృష్ణ,ఉమేష్,వాసు, పాషా, శివ గౌడ్, మల్లేష్, సుమన్,వినీత్, జోగు శ్రీనివాస్, శంకర్, కృష్ణ,ప్రభాకర్, భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆదర్శ పాఠశాల,కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**-ఆదర్శ పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ శివ స్వరూపా రాణి**

**చౌటుప్పల్, జూన్ 17, హైదరాబాద్ మిర్రర్ :**

యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2026 -27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ,ఏసీఈ గ్రూపులలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణి పత్రికకు ఇచ్చిన ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అర్హులైన స్థానిక విద్యార్థులు ఈనెల 22 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు ఇట్టి సదావకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



# 50 రోజులు గడిచినా నిందితుల అరెస్టు లేదంటూ కలెక్టర్‌కు వినతి

## తలారి హరికృష్ణది హత్యేనని కుటుంబ సభ్యుల ఆరోపణ

## మెడికల్ రిపోర్ట్ లను తారుమారు చేసి ఆధారాలు లేవని బుకాయిస్తున్న పోలీసులు



**వికారాబాద్, జూన్ 17(హైదరాబాద్ మిర్రర్):**

రుద్రారం గ్రామంలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన తలారి హరికృష్ణది ముమ్మాటికీ హత్యేనని, అయితే పోలీసులు కేసును నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును వినిపించారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బషీరాబాద్ మండలం జీవంగి గ్రామానికి చెందిన తలారి హరికృష్ణ ఈ ఏడాది ఏప్రిల్ 29న పని నిమిత్తం రుద్రారం గ్రామానికి వెళ్లగా, అదే రోజు మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు కేసులో ఎలాంటి పురోగతి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హరికృష్ణ మృతిపై పలుమార్లు కోడంగల్ సీఐ, ఎస్సైలకు వివరించినప్పటికీ స్పందన లభించలేదని, అనుమానితులను విచారించే చర్యలు కూడా చేపట్టలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అంతేకాకుండా కోడంగల్ ఎమ్మార్వో, తాండూరు ఆర్డీవో, జిల్లా ఎస్పీ, పరిగి డీఎస్పీలను కలిసి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని కేసును నిష్పక్షపాతంగా విచారించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యూ.బుగ్గప్ప, జిల్లా కార్యదర్శి యం.వెంకటయ్య,జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి,ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కప్ప,కెవిన్పియస్ జిల్లా నాయకులు రత్నం, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నాయకులు ఆంజనేయులు జుంటుపల్లి తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి ప్రెస్ క్లబ్‌కు నూతన కార్యవర్గం ఎన్నిక

## ప్రధాన కార్యదర్శిగా సలాముద్దీన్,కోశాధికారిగా శంకర్ ఎన్నిక

**మందమర్రి,జూన్ 17 (హైదరాబాద్ మిర్రర్)**

మందమర్రి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం హడాక్ కమిటీ ఆధ్వర్యంలో సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో గజ్జల చందర్ తన ప్రత్యర్థిపై స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఎండి సలాముద్దీన్,కోశాధికారిగా సకినాల శంకర్ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియలో ప్రెస్ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గజ్జల చందర్ మాట్లాడుతూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన హడాక్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.తన విజయానికి సహకరించిన ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధితో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు.సభ్యుల సహకారంతో ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు,సీనియర్ జర్నలిస్టులు, హడాక్ కమిటీ ప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.





# జిల్లెలగూడ పీఎం శ్రీ జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించిన బిజెపి నేతలు

## -పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన శ్రీరాములు అందెల

**హైదరాబాద్ మిర్రర్: బాలాపూర్ ప్రతినిధి జూన్ 17 :-**

మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్, మీర్‌పేట్ డివిజన్‌లో ఉన్న జిల్లెలగూడ పీఎం శ్రీ జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలను మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు బుధవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకం కింద చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 21 పాఠశాలలు ఎంపికయ్యాయని, వాటిలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ఆరు పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. జిల్లెలగూడ పీఎం శ్రీ జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలకు రెండు సంవత్సరాల కాలానికి రూ.33 లక్షలకు పైగా నిధులు కేటాయించబడినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, కరాటే శిక్షణ, క్రీడా సదుపాయాలు, సమ్మర్ క్యాంపులు, సీసీ కెమెరాలు తదితర ఆధునిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆరు రోజుల మెనూను రూపొందించిందని తెలిపారు. వారంలో మూడు రోజులు గుడ్డు, అరటిపండు అందించడంతో పాటు రెండు రోజులు ఆకుకూరలతో కూడిన ఆహారం అందించాలని పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్య, పోషకాహారం అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు తులసి ముకేశ్ ముదిరాజ్, పసునూరి బిక్షపతి చారి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ పదాధికారులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.






# శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఎంటర్ప్రైజెస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి

**హైదరాబాద్ మిర్రర్: బాలాపూర్ ప్రతినిధి జూన్ 17 :-**

రంగారెడ్డి జిల్లా ఎల్ బి నగర్ నియోజకవర్గం నాగోల్ స్నేహపురి కాలనీలో నరేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఎంటర్ప్రైజెస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి వారి వెంట రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పందుల వెంకటేష్ గౌడ్ ,శ్రీనివాస్ వాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలే నాణ్యమైన విద్యకు నిలయం

## విద్యార్థుల హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా

**హైదరాబాద్ మిర్రర్ న్యూస్ , నిర్మల్ బ్యూరో, జూన్ 17.**

ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విద్యకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆయన స్పష్టం చేశారు .బుధవారం కుంటాల మండలంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. పాఠశాల పనితీరు, విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.విద్యార్థుల నమోదు, హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. గైర్హాజరు విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపేలా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి నిరంతర విద్య అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యంపై ఆందోళన**

పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**10వ తరగతి విద్యార్థులతో ముచ్చట**

10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, చదువుతో పాటు సామాజిక అవగాహన కూడా పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల గణిత నైపుణ్యాలను పరీక్షిస్తూ సమకాలీన అంశాలపై చర్చించారు. విద్యార్థుల ప్రతిభ, ప్రాయోగిక నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు.

**హాస్టల్, విద్యుత్ సదుపాయాల పరిశీలన**

పాఠశాల ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పీహెచ్‌సీలో వైద్య సేవల సమీక్ష**

కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ వైద్య సేవలు, రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు.

**అందకూర్‌లో ప్రీ-ప్రైమరీ విభాగం ప్రారంభం**

అందకూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ విభాగాన్ని కలెక్టర్ ప్రారంభించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. బాల్య విద్య ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో వనజ, మండల విద్యాశాఖ అధికారి ముత్యం, సర్పంచ్ గజేందర్ తదితరులు పాల్గొన్నారు.“నాణ్యమైన విద్యకు క్రమబద్ధమైన హాజరు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, ఉపాధ్యాయులు-తల్లిదండ్రులు-అధికారుల సమిష్టి కృషి అత్యవసరం” అని కలెక్టర్ భవేష్ మిశ్రా పేర్కొన్నారు.

# కుమారుడని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన సామాజిక కార్యకర్త, ఆర్టిఐ జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్

**యాదాద్రి భువనగిరి, జూన్ 17(హైదరాబాద్ మిర్రర్):**

యాదాద్రి భువనగిరి జిల్లాచౌటుప్పల్ మండలం లోని నేలపట్ల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త , సమాచార హక్కు రక్షణ చట్టం -2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్ తన కుమారుడు దబ్బటి అభిమన్యు ను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించారు ఈ సందర్భంగా దబ్బటి శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో నాణ్యమైన విద్య ఉందని ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారం చేస్తున్నారని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని పిల్లలను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత , శ్రీవాణి , శ్వేత తదితరులు పాల్గొన్నారు.



# ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

## జూనియర్ విద్యార్థులతో వెట్టి చేయించిన సీనియర్లు

## 12మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసిన ప్రిన్సిపాల్

హైదరాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ ఉదంతం కలకలం రేపింది. దీనిపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడ్డ పలువురు విద్యార్థులను ఆరునెఉలలపాటు బహిష్కరించినట్లు ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ వెల్లడించారు. జూన్ తొమ్మిదో తేదీన కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న బీడీఎస్ విద్యార్థులు తమపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన కాలేజీ యాజమాన్యం, ఆ రోజే సదరు ఫైల్ ఇయర్ విద్యార్థులను పిలిపించి గట్టిగా మందలించింది. అయితే, యాజమాన్యం హెచ్చరించిన 24 గంటలు తిరగకముందే సీనియర్ విద్యార్థులు మరోసారి ర్యాంకింగ్‌కు పాల్పడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి ర్యాగింగ్‌కు పాల్పడిన మొత్తం 12 మంది విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. 'జూనియర్లతో సీనియర్లు ఆల్కహాల్, సిగరెట్లు తెప్పించడంతో పాటూ కూలర్లలో నీళ్లు నింపడం వంటి పనులు చేయిస్తూ వేధించేవారు. ర్యాగింగ్ భయంతో మూడో సంవత్సరం చదువుతున్న కొందరు బాధితులు హాస్టల్ గదుల నుంచి బయటకు రావడానికి కూడా భయపడిపోయారు. ర్యాగింగ్‌కు పాల్పడిన థర్డ్ ఇయర్ విద్యార్థులపై గతంలోనూ ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన హాస్టల్లోని సీసీ కెమెరాలను పగలగొట్టడమే కాకుండా, ఇతర విద్యార్థులను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఆ సమయంలో వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమవ్వగా, సదరు విద్యార్థులు యాజమాన్యానికి క్షమాపణలు చెప్పి, మరోసారి ఇలాంటి తప్పులు చేయబోమని నమ్మించారు. కానీ, వాళ్ల బుద్ధి మారలేదు.. మరోసారి అదే తరహా ప్రవర్తనతో జూనియర్లను వేధించారు. ఈ క్రమంలోనే 12 మంది విద్యార్థులను సస్పెండ్ చేశాం అని తెలిపారు. అలా చేయడం వల్ల పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతో ఉంటుందని కాలేజ్ యాజమాన్యం అభిప్రాయం అని అన్నారు. ఇది వారికి గుణపాఠం కావాలన్నారు. అలాగే మిగతా వారికి ఓ హెచ్చరిక అన్నారు. ఇదిలావుంటే ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకిదిగారు.

# జొన్నల కొనుగోలుకు లంచం డిమాండ్

## మనస్తాపంతో రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అప్పులు చేసి పంటలు పండిస్తే కొనేనాథుడు లేక వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులు అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన నుగూరే పాండురంగ్(48) అనే రైతు తాను పండించిన జొన్న పంటను విక్రయించేందుకు మే 23న తేదీన సిరికొండ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. హమాలీలకు డబ్బులు చెల్లించిన అనంతరం లారీలో లోడ్ చేసేందుకు అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది డిమాండ్ చేశారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, పది రోజులైనా జొన్నలు లోడ్ చేయలేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# బిఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్

ఆసిఫాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండలంలోని పాట్నాపూర్ సర్పంచ్ ఖందరే లక్ష్మిబాయి బాలాజీ బుధవారం ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే కోవలక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ తెలంగాణ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ వైపు ప్రజాప్రతినిధులు తిరిగి రావడం పార్టీపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొడప్ప ప్రకాష్ ,శివునూర్ సర్పంచ్ జాదవ్ శ్రావణ్, కోలాం శంకర్, మనకు గూడా సర్పంచ్ దేవుషా, యశోదాబాయి కేశవ్, దుబ్బగూడా సర్పంచ్ మాడవి కౌశల్య, దబోలి సర్పంచ్ మెస్రం గంగాదేవి భావురావ్, మాడవి నాగురావ్, మాజీ సర్పంచ్ మాడవి భీంరావ్ , నాయకులు ముండే సతీష్, సమాధాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇంటి ముందు ధర్నా

## నేరుగా జీతాలు చెల్లించాలని

## పంచాయితీ కార్మికుల డిమాండ్

వేములవాడ,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసాన్ని ముట్టడించారు. వేములవాడ పట్టణం తెలంగాణ చౌక్ నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీగా వెళ్లిన కార్మికులు ఎమ్మెల్యే నివాసం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లారెడ్డి, రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా గ్రీన్ ఛానల్ ద్వారా 50 కోట్ల రూపాయలను విడుదల చేసి కార్మికులకు నేరుగా వేతనాలు అందించాలన్నారు. ప్రతి కార్మికునికి 26వేల రూపాయల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.జీవో నెంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి రెండవ పీర్సీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం కూడా అందించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, గణెళిష్, సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# పానీపూరీ తిని అస్వస్థతకు గురైన చిన్నారులు

## మెరుగైన వైద్యం అందించాలని సిపిఐ డిమాండ్

సిరిసిల్ల,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

పానీపూరి తిని అస్వస్థతకు గురైన బాధిత చిన్నారులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. స్థానిక సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్షన్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ఇటువంటి ఘటనలు జరుగు తున్నాయని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు వ్యాపారులు ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత పాటించకుండా వీధుల్లో పానీపూరి, ఐస్‌క్రీమ్, చెరుకురసం విక్రయిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇలాంటి ఆహార పదార్థాల విక్రయాలపై తనిఖీలు నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గుంటి వేణు, మిాసం లక్ష్మణ్, సోమ నాగరాజు పాల్గొన్నారు.



# పోలీస్ స్టేషన్‌కు బారికేడ్లు అందజేత

నిజామాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీస్ స్టేషన్‌కు బారికేడ్లు అందజేయడం మంచి పరిణామని మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలోని యశశ్రీ హై స్కూల్ నిర్వాహకులు రెండు బారికేట్లు అందజేశారు. స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, యశశ్రీ హై స్కూల్ నిర్వాహకులు పి అనిల్ కుమార్, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కూచి సిద్దు, వైస్ చైర్మన్ బొట్టే గజేందర్, బీర్కూర్ శ్యాం కుమార్, కప్ప సంతోష్, ప్రభాకర్ తదితరులున్నారు.

# కోటగిరి దేవాలయాల్లో హుండీలు చోరీ

## హుండీలను పగులగొట్టి డబ్బు చోరీ చేసిన దొంగలు

నిజామాబాద్,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప, సాయిబాబా దేవాలయాల్లో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఆలయంలోకి చొరబడి రెండు హుండీలను చోరీ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కోటగిరిలోని శ్రీ అయ్యప్ప, సాయిబాబా దేవాలయంలో అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి నల్లని ముసుగు ధరించి ఆలయంలోకి చొరబడ్డారు. దేవాలయంలోని గర్భగుడి తాళాలు పగలగొట్టి, గర్భగుడిలో ఉన్న రెండు హుండీలను తీసుకొని పరారయ్యారు. దేవాలయం పక్కనే ఉన్న కాలువలో హుండీల తాళాలు పగల కొట్టి డబ్బులను తీసుకువెళ్లారు. హుండీలను అక్కడే కాలువలో పడేశారు. దేవాలయానికి సంబంధించిన తాళాలను వ్యవసాయ పొలాల్లో అక్కడక్కడ పడేశారు. దేవాలయం కమిటీ సెక్రటరీ నిశాంత్ ఫిర్యాదు మేరకు క్లూస్ టీంను రంగంలోకి దించి వివరాలను సేకరిస్తున్నామని, దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. హుండీలనుంచి సుమారుగా రూ.40 వేలకు పైగా ఉండవచ్చని చెప్పారు.

## నమిలె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

### పురోగతిని పరిశీలించిన హౌజింగ్ పిడి

యాదాద్రి భువనగిరి,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

రాజాపేట మండలంలోని నమిలె గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ పీడీ లక్క అలివేలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సందర్శించి పనుల నాణ్యత, నిర్మాణ వేగం, లబ్దిదారులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో మాట్లాడిన హౌసింగ్ పీడీ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యమని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్దిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామంలో చేపడుతున్న పనులపై స్థానిక ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న ఆమె, నిర్మాణాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నిర్మాణ సామగ్రి నాణ్యత విషయంలో రాజీ పడకుండా అన్ని పనులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులి రాజు, ఉప సర్పంచ్ మార్క శివకుమార్, గ్రామ నాయకులు మాయకోటి రాజు, బొమ్మగాని శ్రీను, మార్కెట్ డైరెక్టర్ సీలేవేరు బాలరాజు, హౌసింగ్ ఏఈ వేముల వివేక్, పంచాయతీ కార్యదర్శి ఎండీ జెమిల్ పాల్గొన్నారు.

## దేవరకొండ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నల్లగొండ,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ బుధవరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజన వసతులను పరిశీలించి, భోజనం నాణ్యత ఎలా ఉందని రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజల పట్ల వైద్యులు, సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన వ్యక్తి శవంగా గుర్తింపు

## తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

ఖమ్మం,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలిన ఘటన కారేపల్లి మండలం పోలంపల్లిలో వెలుగుచూసింది. పోలంపల్లికి చెందిన అవివాహితుడు మూతి వీరభద్రం (43) అదే గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో పూజారిగా పని చేస్తున్నాడు. 25 రోజుల క్రితం వెస్టేజ్ కంపెనీ మీటింగ్ ఉందని ఇంటి నుండి వెళ్లాడు. రెండు రోజులైన ఇంటికి రాకపోవడం సెల్ ఫోన్ స్విఛాఫ్ ఉండడంతో తల్లిదండ్రులు మూతి బుచ్చిరాములు-లక్ష్మి తమ బంధువుల గ్రామాల్లో వాకబు చేసిన వీరభద్రం జాడ కనిపించలేదు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మిదేవి మండలం గుట్టమల్ల సమీపంలోని జామాయిల్ తోటలో శవం ఉందని అక్కడి స్థానికులు పోలీసులకు తెలుపడంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు. శవం వద్ద సెల్ ఫోన్, ఆధార్ కార్డు పడి ఉండడంతో దాని ఆధారంతో వీరభధ్రంగా గుర్తించి కారేపల్లి పోలీసుల ద్వారా పోలంపల్లికి కబురు చేశారు. ఆ ప్రాంతానికి వెళ్లిన వీరభద్రం తల్లిదండ్రులు, సోదరుడు సుధాకర్ శవాన్ని గుర్తించారు. మృతదేహం కుళ్లి పోయి ఉండడంతో పోలీసులు అక్కడే శవ పంచనామా నిర్వహించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు లక్ష్మిదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రం

భద్రాద్రి కొత్తగూడెం,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బూర్గంపహాడ్ మండలంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంఈఓ యదుసింహరాజు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామని, విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 28 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని.. ప్రతి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో వీటిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఆధార్ నమోదు కేంద్రంలో డెమోగ్రఫిక్, బయోమెట్రిక్, మ్యాండటరీ బయోమెట్రిక్, న్యూ ఎన్‌రోల్‌మెంట్ (కొత్త ఆధార్) సేవలు అందుబాటులో ఉంటాయని, 5 ఏళ్లు, 15 ఏళ్లు దాటిన పిల్లలు, పెద్దలు వేలిముద్రల ద్వారా అప్‌డేట్ ఖచ్చితంగా చేసుకోవాలని సూచించారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కృషి

### కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం

భద్రాద్రి కొత్తగూడెం,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారంర బూర్గంపహాడ్ మండలంలో పర్యటించిన ఆయన బూర్గంపహాడ్ మండల కేంద్రంలో రూ.65 లక్షల అంచనాతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు పనులకు ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లు పూర్తయితే రవాణా సౌకర్యవంతం గా ఉంటుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్‌హాల్‌లో తాసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని 34 మంది లబ్దిదారులకు చెక్కులు అందించడంతో పాటు 25 మందికి రూ.13 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వరరావు, ఏఈ చక్రధరాచారి, సర్పంచులు మందా నాగరాజు, బాదం వెంకటేశ్‌రెడ్డి, పోతినేని సూరమ్మ, సర్పా నాగమణి, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ పాల్గొన్నారు.

# కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్ సురేష్‌లాల్ పుస్తకం

## 'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' ఢిల్లీలో ఆవిష్కరణ

హనుమకొండ,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ రచించిన 'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' పుస్తకాన్ని బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఆచార్య ఎస్.మహేంద్రదేవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేంద్ర దేవ్ మాట్లాడుతూ పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణలులేని సమాజ నిర్మాణానికి ఈ పుస్తకం దార్శనికతతో కూడిన ఆచరణాత్మక మార్గదర్శకాన్ని అందిస్తుందని తెలిపారు. పుస్తక రచయిత సురేష్‌లాల్ మాట్లాడుతూ సున్నా పేదరికం, నిరుద్యోగం, అసమానత, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణ అనే ఐదు ప్రధాన లక్ష్యాల ఆధారంగా మానవ సంక్షేమం, సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి, ప్రపంచ శాంతి సాధనకు అవసరమైన విధానాలను ఈ గ్రంథంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. కేస్ స్టడీలు, నిపుణుల విశ్లేషణలు, కార్యాచరణ వ్యూహాల ద్వారా ఈ లక్ష్యాల పరస్పర అనుసంధానాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ చేతన్ గాటే, ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.డి.ఎన్. భాజ్‌పాయ్, జనరల్ సెక్రటరీ రవీంద్ర బర్మే, ప్రముఖ ఆర్థికవేత్త అశ్విని మహాజన్ పాల్గొని సురేష్‌లాల్‌ను అభినందించారు.

# మున్నేరువాగుపై ప్రాజెక్ట్ నిర్మాణం

## సర్వే పనులను అడ్డుకున్న గిరిజనులు

మహబూబాబాద్ ,జూన్17(హైదరాబాద్ మిర్రర్):

మహబూబాబాద్ జిల్లాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గార్ల మండలం దుబ్బగూడెం సమీపంలో మున్నేరు వాగు పై ప్రభుత్వం నిర్మించనున్న పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్ట్ సర్వే పనులను గిరిజనులు అడ్డుకున్నారు. తమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చే పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు ఒప్పుకునేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుద్దారం గిరిజనులు రోడ్డు పై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చావనైనా చస్తాము తప్ప మా భూములను వదులుకోబోమని హెచ్చంచారు. పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

## సర్‌తో ముస్లిం ఓట్ల

మొదటిపేజీ తరువాయి

# తొలగింపు కుట్ర

- బెంగాల్, బాహార్‌లే ఇందుకు నిదర్శనం
- మీడియాతో మంత్రి అజారుద్దీన్ వ్యాఖ్య



హైదరాబాద్,జూన్17హైదరాబాద్ మిర్రర్:

'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లను తొలగించే అవకాశముందని తెలంగాణ మంత్రి అజారుద్దీన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. 'సర్' అందరి అంశమైనా.. ముస్లింల ఓట్లనే టార్గెట్ చేస్తారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్, బిహార్‌లో ముస్లింల ఓట్లు తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలోనూ అలాంటి కుట్రలకు పాల్పడే ఛాన్స్ ఉందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి అజారుద్దీన్ మాట్లాడారు. 'సర్' అంశంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరి ఓటుని వాళ్లే కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

మొదటిపేజీ తరువాయి

# చీలిక దిశగా ఉద్ధవ్ శివసేన

### పార్టీ టిక్కెట్‌పై గెలిచిన వారు రాజీనామా చేయాలి

### ఎంపి సంజయ్ రౌత్ ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూన్17హైదరాబాద్ మిర్రర్:



మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే మరోసారి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. పలువురు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే నేతృత్వం లోని శివసేనలో చేరనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశానికి ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా రెబల్స్‌ను ఉద్దేశించి రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన మాటలను బీప్ చేయొద్దని పాత్రికేయులకు సూచించడం గమనార్హం. ద్రోహులు వెళ్లిపోవాలి. అసమ్మతివాదులు మొదట రాజీనామా చేయాలి. పార్టీ టికెట్‌పై గెలిచినవారికి ప్రజాతీర్పును మోసగించే హక్కు లేదు. పార్టీ మారేందుకు కొందరు ఎంపీలకు రూ.50 కోట్లు ఆఫర్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే మాకు చీలిక గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. మీడియాలో చక్కర్లు కొడుతోన్న వార్తలతో ఈ విషయం మా దృష్టికి వచ్చిందని రౌత్ మాట్లాడారు. ఈ పరిణామాల నేపథ్యంలో శివసేన (యూబీటీ) చట్టపరమైన చర్యలు ప్రారంభించిందని చెప్పారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో కూడా చీలికలు వచ్చాయి. వీటిని సంజయ్ ప్రస్తావించారు. చీలికలు ఇలా ఉంటే.. ఎన్నికల్లో పోటీపడటంలో అర్థమే లేదన్నారు. 2022 తరహా తిరుగుబాటు మరోసారి జరిగితే మహారాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఆ ఏడాది శివసేన రెండుగా చీలిపోయింది. అప్పటివరకు ఉన్న పార్టీ పేరు, గుర్తు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని చీలిక వర్గానికి దక్కాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ పేరు శివసేన (యూబీటీ)గా మారింది. లోక్‌సభలో శివసేన (యూబీటీ)కి తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు.

# ఆర్ట్స్ కాలేజీలో రిక్రూట్మెంట్ డ్రైవ్ పోస్టర్ రిలీజ్

హుజురాబాద్, జూన్ 17, హైదరాబాద్ మిర్రర్ :

రేపు ఉదయం 9 గంటలకు ఆడిటోరి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ హనుమకొండలో జరగబోయే మెగా జాబ్ రిక్రూట్మెంట్ డ్రైవ్ సంబంధించిన గోడ ప్రతులను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తన ఛాంబర్స్ లో బుధవారం విడుదల చేశారు. లక్ష్ ఫౌండేషన్ ఆర్ట్స్ కళాశాల సంయుక్తంగా నిర్వహించబోతున్న ఈ డ్రైవ్ కి కాకతీయ యూనివర్సిటీకి అనుగుణంగా ఉన్న అన్ని కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ డ్రైవ్ లో మొత్తం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కు సంబంధించిన 25 కంపెనీల ప్రతినిధులు, హెచ్ ఆర్ లు పాల్గొంటున్నారు. ఈ డ్రైవ్ పోస్టర్ రిలీజ్ లో కళాశాల ట్రైనింగ్ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ జితేందర్, సీనియర్ భౌతిక శాస్త్ర అధ్యాపకులు ప్రవీణ్ కుమార్, సంస్థ తరుపున సందీప్ రెడ్డి, సీనియర్ మేనేజర్ సునీల్ పాల్గొన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి అన్ని జిల్లాలకు సంబంధించి డిగ్రీ, పీజీ ఫైనల్ ఇయర్ లేదా పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొనవచ్చు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగ పరుచుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.



# గంగారం గ్రామంలో పోలీసుల కార్డన్ సెర్చ్

కాల్వ శ్రీరాంపూర్, జూన్ 17, హైదరాబాద్ మిర్రర్ :

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామంలో బుధవారం కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో తనిఖీలు చేపట్టారు.కార్డన్ సెర్చ్‌లో భాగంగా గ్రామంలోని పలు ప్రాంతాలను పరిశీలించి, సుమారు 20 గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 40 ద్విచక్ర వాహనాల పత్రాలను తనిఖీ చేసి, అనుమానాస్పద అంశాలపై విచారణ నిర్వహించారు.అనంతరం గ్రామ ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించిన సీఐ రంజిత్ రావు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో చోటుచేసుకుంటున్న వివిధ నేరాలు, మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను అరికట్టడం సులభమవుతుందని పేర్కొన్నారు.అలాగే గ్రామంలో కొత్తగా వచ్చిన లేదా అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా గంగారం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ గ్రామంలో 22 సీసీ కెమెరాలను



ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వగా, వారి నిర్ణయాన్ని సీఐ అభినందించారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, ప్రతి గ్రామం వాటి ఏర్పాటుకు ముందుకు రావాలని సీఐ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పోలీసు సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి.

కొడిమ్యాల:జూన్ 17(హైదరాబాద్ మిర్రర్).

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు,చొప్పదండి నియోజక వర్గ అభివృద్ధికి మరియు ప్రజా సేవకు ఆకర్షితులై బుధవారం రోజున కొడిమ్యాల మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సింగిరెడ్డి తిరుపతి రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరిన చొప్పదండి శాసన సభ్యుడు,కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం.




## బొల్లెంచెరువులో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం.

కొడిమ్యాల:జూన్ 17(హైదరాబాద్ మిర్రర్).

కొడిమ్యాల మండలం బొల్లంచెరువు గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో బుధవారం రోజున అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.3 నుండి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు టీచర్ లత సూచించారు.అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను అందిస్తారని మరియు నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు,చిన్నారుల శారీరక,మానసిక వికాసానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సామంతుల గంగవ్వ,అంగన్వాడి టీచర్ లత, వార్డ్ మెంబర్,కేడిసిబి బ్యాంక్ డైరెక్టర్ కనకట్ల రమేష్,తల్లులు పిల్లలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించిన

### -రామగుండంనియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు

గోదావరిఖని జూన్ 17 హైదరాబాద్ మిర్రర్

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సలహాదారులుగా వీ హనుమంతరావు ఎన్నికైన సందర్భంగా వారిని, కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో భోక్యాలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సలహాదారులుగా వి హనుమంతరావు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారిని, మున్నూరు కాపుచైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని హైదరాబాదులోని రవీంద్రభారతిలో మా రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం పక్షాన వారిని మర్యాదపూర్వకంగా కలిసి రాబోయే కాలంలో మా మున్నూరు కాపు సంఘానికి, రామగుండం నియోజకవర్గం మీ వంతుగా కృషి చేసి మా మున్నూరు కాపు సంఘం మరి ఎంతో అభివృద్ధి చెందేలా మీ సహాయ సహకారాలు అందించాలని, రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకుల పక్షాన ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావుని, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని కోరడం జరిగిందని రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పానుగంటి సత్యనారాయణ, చల్ల శ్రీనివాస్ అప్పసి శ్రీనివాస్, రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.



## హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీకి ఎస్టీపీ (మురుగు నీటి శుద్ధీకరణ) మంజూరు

### మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేసిన వొడితల ప్రణవ్

### మురుగు నీటి శుద్ధీకరణ ప్రాజెక్ట్ సంబంధించి అధికారుల దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ప్రణవ్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హుజురాబాద్, జమ్మికుంట ప్రజల పక్షాన ధన్యవాదాలు

హుజురాబాద్, జూన్ 17, హైదరాబాద్ మిర్రర్ :



రాష్ట్రంలో మున్సిపల్ లో పెరుగుతున్న జనాభా, వాటి నుండి నిత్యం మురుగునీరు వెలువడుతున్న నేపథ్యంలో నీటిని శుద్ధి చేసి పర్యావరణాన్ని కాపాడేందుకు మురుగునీటిని శుద్ధీకరణ చేసే కర్మాగారాన్ని (ఎస్టీపీలను) హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని. దానికి సంబంధించి జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుకు హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు 45 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు, మురుగు నీరు శుద్ధిచేసే కర్మాగారాలు హుజురాబాద్ లో 2, జమ్మికుంట మున్సిపల్ కు ఒకటి కేటాయించిందని. దానికోసం అధికారులతో ఇక్కడున్న పరిస్థితులను ముఖ్యమంత్రి, అధికారుల దృష్టికి ప్రణవ్ తీసుకెళ్లగా.. మంజూరు చేసినట్టు తెలిపారు. మున్సిపల్ లో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా తీరుస్తామనీ. ఈ కర్మాగారాన్ని మున్సిపాలిటీలకు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల నియామకం

కాల్వ శ్రీరాంపూర్, జూన్ 17, హైదరాబాద్ మిర్రర్ :



కాల్వ శ్రీరాంపూర్ (మల్యాల)లోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి గంటల వారీ (హౌర్లీ బేస్డ్) ఉపాధ్యాయుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య తెలిపారు.ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఇంగ్లీష్ మరియు కెమిస్ట్రీ సబ్జెక్టులకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) ఉత్తీర్ణతతో పాటు బి.ఎడ్. అర్హత తప్పనిసరి అని పేర్కొన్నారు.అర్హత మరియు ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన ధ్రువపత్రాల ప్రతులతో కూడిన దరఖాస్తులను పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, కాల్వ శ్రీరాంపూర్ (మల్యాల), ప్రిన్సిపాల్ కి సమర్పించాలని సూచించారు.అలాగే బోధనా రంగంలో అనుభవం కలిగిన అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు వీలైనంత త్వరగా తమ దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# ప్రభుత్వ బడులే భవిష్యత్తుకు పునాది

హైదరాబాద్ మిర్రర్ న్యూస్ జూన్. 17

జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ భీంగల్ పిల్లల బాధ్యత మా బాధ్యత ప్రభుత్వ బడుల్లోనే భారత భవిష్యత్తు రూపు దిద్దుకుంటుంది.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్) ద్వారా విద్యారంగంలో కొత్త విప్లవానికి శ్రీకారం చుడుతున్నాం.కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం..ప్రతి విద్యార్థి మట్టిలో మాణిక్యంలా మెరవాలి, ప్రతిభకు అవకాశాలు కల్పించడమే టీపీఎస్ ఉద్దేశం. నాణ్యమైన విద్య ద్వారానే సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది.' కులాలు, వర్గాలు కాదు.. పిల్లల భవిష్యత్తే ప్రభుత్వానికి ముఖ్యం. ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచడమే ప్రధాన లక్ష్యం.విద్యారంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.27వేల కోట్లకు పైగా కేటాయిస్తోంది.అసమానతలను తగ్గించి సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి విద్యకే ఉంది.ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం గర్వకారణంగా మారేలా తెలంగాణ విద్యా





# పెద్ది నుంచి చికిరి చికిరి ఫుల్ సాంగ్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'పెద్ది' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'చికిరి చికిరి' అనే పాటకి సంబంధించిన ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్, జాన్వీ గ్లామర్, మాస్ కొరియోగ్రఫీ హైలైట్‌గా నిలిచాయి. చరణ్ రగ్డ్ లుక్‌లో, ఊర మాస్ స్టెప్పులతో ఇరగదీయగా, జాన్వీ కపూర్ ట్రెడిషనల్ అవుట్‌ఫిట్‌లో కుర్రకారు మతులు పోగొడుతోంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించాడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.



# ఆల్ఫా ట్రైలర్ విడుదల

యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. 'గొర్రెలా కాదు? తోడేలులా జీవించాలి' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# మా ఇంటి బంగారంలో సమంత పవర్‌ఫుల్ రోల్

టాలీవుడ్ నటి సమంప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ యాక్షన్ డ్రామా, రిలీజ్‌కు ముందే పెట్టిన పెట్టుబడిని పూర్తిగా రికవరీ చేసుకొని లాభాల బాట పట్టింది. ఈ విషయాన్ని 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై చిత్ర నిర్మాత హిమాంక్ దువ్వూరు అధికారికంగా ప్రకటించారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమాను రూ. 25 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మధ్య బడ్జెట్‌తో నిర్మించారు. అయితే థియేట్రికల్, నాన్-థియేట్రికల్ (ఓటీటీ, శాటిలైట్) హక్కులకు మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడటంతో, అన్ని డీల్స్ రిలీజ్ వారంలోనే విజయవంతంగా క్లోజ్ అయినట్లు తెలుస్తుంది. ఫలితంగా సినిమా విడుదలకు ముందే సేఫ్ జోన్‌లోకి వచ్చేసింది. ప్రస్తుత మార్కెట్‌లో ఒక మహిళా ప్రధాన తెలుగు చిత్రానికి ఇంతటి క్రేజ్ రావడం బలమైన కమర్షియల్ సిగ్నల్ అని చిత్ర బృందం పేర్కొంది.

# మరింత మెరుగ్గా సింగ్ గీతం గ్రాఫిక్స్



ప్రముఖ దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నాగ్ అశ్విన్ నిర్మించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' జూన్ 12న థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమా క్షి రిలీజ్‌లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు నాగ్ అశ్విన్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.'ఈ సినిమా ఓటీటీ వెర్షన్.. థియేటర్ వెర్షన్ కంటే భిన్నంగా ఉంటుంది' అని నాగ్‌అశ్విన్ వెల్లడించారు. నిర్మాణదశ చివర్లో ఎదురైన సవాళ్ల గురించి ఆయన ప్రస్తావిస్తూ.. క్లైమాక్స్‌లోని కంప్యూటర్ గ్రాఫిక్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందని అనిపించింది. డిజిటల్ విడుదలకు ముందు, గ్రాఫిక్స్‌ని మరింత మెరుగు పరచడానికి మా బృందం యోచిస్తోంది. ఈ చిత్రాన్ని కొన్ని దశాబ్దాల పాటు ప్రేక్షకులు డిజిటల్ వేదికగా ఆదరిస్తూనే ఉంటారు. అందుకే భవిష్యత్తు రోజులకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేయాలని భావించాం' అని పేర్కొన్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో మెరిశారు. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ప్లిక్స్‌కి విక్రయించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. అందువల్ల ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టొచ్చని తెలుస్తోంది.





# లాయర్ పాత్రలో కీర్తి సురేశ్- జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి

ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బ్జడెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889